క్లుప్తంగా

కార్మికుల పొట్ట కొట్టొద్దు

తిరుపతి అర్బన్: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేసి వేలాదిమంది కార్మికులు పొట్ట కొట్ట వద్దు అంటూ విద్యార్థి సంఘం నేతలు నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం తిరుపతిలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద నేతలు పెద్దఎత్తున ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కత్తి రవి, ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఒక విధంగా, అధికారంలోకి వచ్చాక మరోలా చిన్నబాబు, పెద్దబాబు మాట్లాడడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకోవడానికి రాష్ట్రస్థాయిలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి చలపతి, డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయచంద్ర, ఉదయ్ పాల్గొన్నారు.

ముందస్తు దసరా వేడుకలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి నగరంలోని పలు పాఠశాలల్లో ముందస్తు దసరా వేడుకలు జరుపుకున్నారు. పాఠశాల ఆవరణలో అమ్మవారి ప్రతిమను ప్రతిష్ఠించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులు ధరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవీ నవరాత్రుల విశిష్టతను విద్యార్థులకు వివరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు.

15 మందికి జరిమానా

తిరుపతి లీగల్: తిరుపతిలో స్వల్ప మోతాదులో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 15 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ మంగళవారం తీర్పు చెప్పారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసులు నగరంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు కోర్టు కానిస్టేబుల్ గిరిబాబు తెలిపారు.

రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులు

రామచంద్రాపురం: మండలంలోని కేకేవీపురం ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు అండర్-19 రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల హెచ్ఎం భాస్కర్ తెలిపారు. మంగళవారం స్కూల్‌లో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేణిగుంట బాలికల పాఠశాలలో జరిగిన అండర్-19 జిల్లాస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో బాలికల విభాగంలో లక్ష్మీ, బాలుర విభాగంలో అఖిల్ ప్రత్యేక ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైట్లు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేటు కళాశాలలపై చర్యలు తీసుకోండి



వీసీకి వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో డిగ్రీ, పీజీ కోర్సులు నడుపుతున్న ప్రైవేటు కళాశాలలు పరీక్షల రుసుము పేరుతో వర్సిటీ నిర్ణయించిన ఫీజులకంటే రెండింతలు వసూలు చేస్తున్నాయని తక్షణం ఆ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వీసీ సీహెచ్ అప్పారావుకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో వక్తృత్వ పోటీలు

తిరుపతి సిటీ: రాష్ట్ర ఉన్నత విద్యామండలి సూచనల మేరకు పద్మావతి మహిళా వర్సిటీలో విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. వర్సిటీ స్టూడెంట్ అఫైర్స్, మహిళా అధ్యయన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం హ్యూమానిటీ బ్లాక్‌లోని సెమినార్ హాల్‌లో వక్తృత్వ, వ్యాసరచన, వ్యాపార ఆలోచన పోస్టర్ తయారీ, ప్రధానంగా జిల్లా, మండల, పంచాయతీ స్థాయిల్లో సామాజిక, ఆర్థిక అభివృద్ధి, మహిళాభివృద్ధి, ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత, ఉత్తమ విద్య వంటి అంశాలపై పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బుధవారం గాంధీ జయంతి సందర్భంగా బహుమతులు, ధ్రువపత్రాలను వర్సిటీ అధికారులు అందించనున్నారు.

భక్తుల సౌకర్యాలపై సమీక్ష

తిరుమల: తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా అక్టోబరు 8న జరిగే గరుడసేవకు లక్షలాదిగా విచ్చేసే భక్తులపై ప్రత్యేక దృష్టి సారించి ఏర్పాట్లు చేయాలని టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. తిరుమల గోకులం విశ్రాంతి భవనంలో మంగళవారం సాయంత్రం అదనపు ఈఓ గరుడ సేవ ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా వాహనాల ముందు ప్రదర్శించే వివిధ రాష్ట్రాలకు చెందిన సాంస్కృతిక బృందాల ప్రదర్శనలకు సంబంధించిన వీడియోను అదనపు ఈఓ పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో రవాణాశాఖ జీఎం శేషారెడ్డి, డిప్యూటీ ఈఓలు రాజేంద్ర, ఆశాజ్యోతి, హెచ్‌డీపీపీ, విజిలెన్స్ తదితర అధికారులు పాల్గొన్నారు.

కాలుష్య రహిత తిరుపతే లక్ష్యం

- పరిసరాల శుభ్రత.. మన బాధ్యత
- జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆరణి



వినాయకసాగర్ వద్ద పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆరణి, కమిషనర్ మౌర్య

తిరుపతి మంగళం : మన చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం మన బాధ్యత అని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఈ స్వచ్ఛతా హీ సేవా 2024 కార్యక్రమంలో భాగంగా వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మంగళం రోడ్డులోని వినాయకసాగర్ వద్ద జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కార్పొరేషన్ కమిషనర్ ఎన్.మౌర్య పారిశుద్ధ్య డ్రైవ్ చేపట్టి పరిసరాలను శుభ్రం చేశారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గడిచిన రెండు వారాల్లో ఎన్నో రకాల కార్యక్రమాలు అమలు చేశామని తెలిపారు. ఈ పారిశుద్ధ్య డ్రైవ్ ద్వారా చాలా ఏళ్ల నుంచి పేరుకుపోయిన చెత్త నిల్వలను తొలగించామని, మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించామని, చిన్న పిల్లలు, యువతకు స్వచ్ఛత మీద రకరకాల పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. గెలుపొందిన విజేతలకు బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో కచ్చపి ఆడిటోరియంలో బహుమతులు అందజేస్తామన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, కార్డులు ఇచ్చామని తెలిపారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పారిశుద్ధ్యం మీద అవగాహన, చర్యలు తీసుకుని తిరుపతి జిల్లాలో సచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తామన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులతో పాటు తిరుపతి నగర ప్రజల ఆరోగ్య దృష్ట్యా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం కమిషనర్ మౌర్య మాట్లాడుతూ తిరుపతి ఆధ్యాత్మిక నగరం పరిశుభ్రంగా ఉందంటే అందుకు పారిశుద్ధ్య కార్మికుల కృషే అన్నారు. అనంతరం తిరుపతి 1వ డివిజన్ సుబ్బారెడ్డినగర్‌లో పెన్షన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ అన్వేష్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

రేషన్ కష్టాలు



ఒకటో తారీఖు వచ్చిందంటే చాలు వృద్ధులకు పించన్లు, రేషన్‌కార్డుదారులకు బియ్యం పంపిణీ కార్యక్రమాల అమలు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అస్తవ్యస్తంగా మారాయి. కార్డుదారులు రేషన్ షాపుల ఎదుట బియ్యం కోసం బారులు తీరుతున్నారు. తిరుపతిలోని ఎస్‌బీఐ కాలనీలో రేషన్ దుకాణం వద్ద జనం క్యూలో నిలబడిన దృశ్యాలను సాక్షి కెమెరా బంధించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

ఎస్‌జీఎస్‌లో వర్క్‌షాపు

తిరుపతి సిటీ: ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, హిందూస్థాన్ బేవరేజస్ కోకాకోల సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం డిజిటల్ మార్కెటింగ్‌పై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సత్యనారాయణ హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఆధునిక సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతున్న నేటి కాలంలో విద్యార్థులు డిజిటల్ మార్కెటింగ్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సుమారు 124 మంది విద్యార్థులు, అధ్యాపకులు ఈ వర్క్‌షాపులో పాల్గొన్నారు.

త్రిష్ణ-2024 పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

తిరుపతి సిటీ: కరకంబాడి రోడ్డులోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం త్రిష్ణ-2024 పోస్టర్‌ను ప్రిన్సిపల్ డాక్టర్ నాదముని రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో నేషనల్ లెవల్ టెక్నికల్ సింపోసియమ్ అనే కార్యక్రమాన్ని త్రిష్ణ పేరుతో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్, వెబ్‌సైట్, వీడియోలను రిలీజ్ చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు రూ.150తో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ పుష్పలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

33 మద్యం షాపులకు నోటిఫికేషన్

తిరుపతి రూరల్ : ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త మద్యం పాలసీలో చంద్రగిరి నియోజకవర్గానికి 33 ప్రైవేటు మద్యం దుకాణాలకు అనుమతి వచ్చింది. తిరుపతి రూరల్ మండలంలో అత్యధికంగా 12, చంద్రగిరి-7, పాకాల-5, రామచంద్రాపురం-4, చిన్నగొట్టిగల్లు-3, ఎర్రావారిపాలెం-2 చొప్పున మొత్తం 33 దుకాణాలకు అనుమతి ఇస్తూ నోటిఫికేషన్ విడుదల చేశారు. తిరుపతి రూరల్, చంద్రగిరి, పాకాల మండలాల పరిధిలోని దుకాణాలకు ఏడాదికి రూ.65 లక్షల చొప్పున, రామచంద్రాపురం, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాలెం మండలాల్లో ఏడాదికి రూ.55 లక్షల చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకునే వారు రూ.2 లక్షల నాన్ రిఫండ్ డిపాజిట్ కట్టాల్సి ఉంటుంది. ఇప్పటికే దరఖాస్తులను స్వీకరిస్తున్నారు.

డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓగా డాక్టర్ శ్రీనివాస్

తిరుపతి తుడా: తిరుపతి రుయా ఆస్పత్రి డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓగా డాక్టర్ శ్రీనివాస్‌ను నియమిస్తూ ఆరోగ్యశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం సీఎస్ఆర్ఎంఓగా విధులు నిర్వహిస్తున్న తులసీరామ్ తక్షణం నూతన సీఎస్ఆర్ఎంఓగా నియమితులైన డాక్టర్ శ్రీనివాస్‌కు బాధ్యతలు అప్పగించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన రుయా ఆస్పత్రిలో బాధ్యతలు చేపట్టారు.

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకుంటే రాణిస్తాం



పోటీలలో ఎంపికైన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: మూఢనమ్మకాలు వదిలినప్పుడే దేశం ముందుకు వెళుతుందని, శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకున్నప్పుడే విద్యార్థులు జీవితంలో రాణించగలరని ఉప విద్యాశాఖాధికారి బాలాజీ అన్నారు. మండలస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల పోటీలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేమన విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో గత నెల 25వ తేదీన జరిగిన పాఠశాల స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులకు పాల్గొని తమ ప్రతిభా పాటవాలను చాటారు. ఇందులో సత్యనారాయణపురం జెడ్పీహెచ్ఎస్, దొడ్డాపురం స్కూల్, పద్మావతిపురం జెడ్పీహెచ్ఎస్ స్కూల్, కోర్లగుంట ఎంసీహెచ్ఎస్ స్కూల్, స్ప్రింగ్ డేల్, వెంకటేశ్వర స్కూల్, ఎస్ఆర్‌పురం బీసీఎం హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన వీరు ఈనెల 27వ తేదీన జరిగే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని వేమన విజ్ఞాన కేంద్ర నగర కార్యదర్శి రఫీ తెలిపారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్‌తో పాటు పుస్తకాలు అందజేశారు. సేవాసంస్కర్త దామోదరం, డాక్టర్ రమేష్ నాథ్, ప్రముఖ రచయిత రమేష్, మణికంఠ అతిథులుగా హాజరై పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో వేమన విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ

పాకాల : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక వారి మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. మంగళవారం ఈ టెస్టులను ఎంఈఓ బాబ్జి, హెచ్ఎం మహమ్మద్‌రఫీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెకిముకి పోటీల్లో ప్రభుత్వ యాజమాన్యం నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పాకాల జట్టు డి.లతీఫ్, ఎన్.అక్షయ్, ఎస్.గణేష్, అలాగే ప్రైవేట్ యాజమాన్యం నుంచి విజయ ఉన్నత పాఠశాల దామలచెరువు విద్యార్థులు మహిమ, తన్మయి, అభినవ్, సాగర్ మండల స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారన్నారు. విజేతలుగా నిలిచిన ఈ జట్లను జిల్లాస్థాయి పోటీలకు పంపుతున్నట్లు వివరించారు.

మానవజాతి మనుగడలో ఫంగస్ కీలకం

తిరుపతి సిటీ: ఆధునిక యుగంలో మానవజాతి మనుగడలో ఫంగస్ కీలక పాత్ర వహిస్తోందని వీసీ సీహెచ్ అప్పారావు అన్నారు. మంగళవారం ఎస్వీయూ మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం పరిపాలనా భవనంలోని సెనేట్ హాల్‌లో ప్రపంచ ఫంగస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యవసాయ, ఔషధాలలో ఫంగస్ పాత్ర అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించారు. ఆయన ప్రసంగిస్తూ ఔషధాల తయారీలో, వ్యవసాయ రంగంలో ఫంగస్ ప్రత్యేక పాత్ర పోషిస్తోందన్నారు. అగ్రికల్చరల్ సెక్టార్‌లో, మానవ ఆరోగ్య సంరక్షణలోనూ ఎంతో ప్రయోజనకారిగా మనుగడ సాగిస్తోందన్నారు. అనంతరం సదస్సుకు సంబంధించిన బ్రౌచర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో శ్రీలంక వర్సిటీ ప్రొఫెసర్ జయలాల్, బెంగళూరుకు చెందిన డాక్టర్ శృతి వసంతియా, యూఏఈ అబుదాబి నుంచి డాక్టర్ సునీల్ ముంద్రా, మంగళూరు వర్సిటీ నుంచి కందికేర రామయ్య, సదస్సు నిర్వాహకురాలు ప్రొఫెసర్ చింతల పరమగీతం, దేశ, విదేశాల నుంచి సుమారు 274మంది ప్రొఫెసర్లు, పరిశోధకులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ముగింపు



శిక్షణ పొందిన ఇన్‌స్ట్రక్టర్స్‌తో అధికారులు

తిరుపతి సిటీ: హిందూస్తాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కౌట్స్ అండ్ గైడ్స్ శాఖ ఆధ్వర్యంలో వలంటీర్లకు బేసిక్ టీచర్ ట్రైనింగ్ కోర్స్ శిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు . గత పదిహేను రోజులుగా తిరుపతి నగరంలో స్థానిక ప్రభుత్వ యూత్ హాస్టల్‌లో కేంద్ర మానవ వనరుల శాఖచే గుర్తింపు పొంది ఏపీ ప్రభుత్వ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్, కాలేజీ ఎడ్యుకేషన్, ఎస్వీ యూనివర్సిటీ, జేఎన్‌టీయూ, ఎస్కే యూనివర్సిటీ వంటి విద్యాలయాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ బోధించడానికి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గత రెండు వారాలుగా స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణార్థులకు నేషనల్ చీఫ్ కమిషనర్, సీనియర్ ట్రైనర్ శ్రీ సక్సేనా స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో ఉపాధ్యాయులుగా పనిచేయడానికి శిక్షణ అందించారు. శిక్షణలో భాగంగా యోగా, ఆత్మ రక్షణ, ప్రాథమిక చికిత్స, సేవాభావం, దేశభక్తి వంటివి పెంపొందించడం స్కౌట్స్ అండ్ గైడ్స్ ముఖ్య ఉద్దేశం అని తెలియజేశారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

తిరుపతి తుడా: నగరంలో ట్రాఫిక్ నియంత్రణ, నగర క్రమబద్ధీకరణకు స్ట్రీట్ వెండార్స్ సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య కోరారు. మంగళవారం సాయంత్రం నగరపాలక సంస్థ కార్యాలయంలో తిరుపతి వెండింగ్ జోన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతిలో ఇష్టారాజ్యంగా తోపుడు బండ్లు, వీధి వ్యాపారులు ఉండడంతో ప్రజలు, భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. నగరం సుందరంగా ఉండాలంటే, ట్రాఫిక్ సమస్యలు తగ్గించాలంటే వీధి వ్యాపారులు సహకరించాలని కోరారు.

సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మున్సిపల్ ఇంజినీర్లు, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, ఏసీపీలు, రెవెన్యూ, మెప్మా, పోలీస్, ఫుడ్ సేఫ్టీ, బ్యాంకు అధికారులు, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

నగరపాలక సంస్థ పరిధిలోని రైల్వే స్టేషన్, విష్ణు నివాసం, కోనేటి కట్ట, ఆర్టీసీ బస్టాండు తదితర ప్రాంతాల్లో మంగళవారం పారిశుద్ధ్య పనులను కమిషనర్ మౌర్య పరిశీలించారు. పలు దుకాణాలు ముందర చెత్త వేస్తుండడం, మురుగు కాలువల్లో చెత్త బ్లాక్ అయి రోడ్లపైకి నీరు వస్తుండడాన్ని గుర్తించి దుకాణదారులను మందలించారు. ఆమె మాట్లాడుతూ తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారని, ఈ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట మున్సిపల్ అధికారులు ఉన్నారు.

తుమ్మలగుంటకు బ్రహ్మోత్సవ శోభ

- సర్వాంగ సుందరంగా ముస్తాబైన కల్యాణ వెంకన్న ఆలయం



01సీడీఆర్01-300075 :

తిరుపతి రూరల్: నవరాత్రి బ్రహ్మోత్సవాలకు తుమ్మలగుంట శ్రీకల్యాణ వెంకన్న ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. రంగు రంగుల విద్యుత్ దీపాలంకరణలతో దేదీప్యమానంగా విరాజిల్లుతోంది. ఆలయ మాడవీధులతో పాటు గ్రామంలో ప్రత్యేక అలంకరణలు చేపట్టారు.

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం..

ఈ నెల 3 నుంచి తుమ్మలగుంట శ్రీకల్యాణ వెంకన్న నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారి గర్భాలయంతో పాటు ప్రధాన ఆలయం ప్రాంగణం మొత్తం శుద్ధి కార్యక్రమాన్ని మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉగాది, ఆణివార ఆస్థానం, వైకుంఠ ఏకాదశితో పాటు వార్షిక బ్రహ్మోత్సవాలకు ముందు వచ్చే మంగళవారం నాడు ఈ వేడుకను నిర్వహించడం ఆనవాయితీ. ఏడాదిలో నాలుగు సార్లు ఆలయ శుద్ధి చేపడతారు. ఆలయంలోని గోపురం మొదలుకుని ప్రధాన వాకిలి వరకు, గర్భాలయం నుంచి ఉప ఆలయాలు, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి వంటి అన్ని రకాల వస్తువులను శుద్ధి చేశారు. అనంతరం పవిత్ర పరిమళ జలాన్ని ఆలయం అంతటా సంప్రోక్షణ చేశారు. స్వామి వారి మూల విరాట్‌కు కప్పిన వస్త్రాన్ని తొలగించి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన తర్వాత స్వామి వారి దర్శనానికి భక్తులను అనుమతించారు.

ముమ్మర ఏర్పాట్లు..

నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆలయంలో ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన ఆలయంతో పాటు తుమ్మలగుంట పరిసరాల్లో స్వాగత తోరణాలు, విద్యుత్ దీపాలతో కూడిన దశావతరాల భారీ కటౌట్లను ఏర్పాటు చేశారు. రాత్రుల్లో విద్యుత్ దీపాలంకరణతో దేవతామూర్తుల రూపాలు దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి. ఇప్పటికే గ్రామంలో స్వామివారి వాహన సేవలు తిరిగే అన్ని ప్రధాన వీధుల్లో రంగవల్లులు ఏర్పాటు చేసి అందంగా తయారు చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాల నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. కళాకారులు, భజన బృందాల వారికి భోజనం, వసతి సదుపాయాలతో పాటు ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు అనువుగా ప్రత్యేక వేదికను ఏర్పాటు చేయించారు.

పంటలో మెళకువలపై అవగాహన



పాకాల: క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలిస్తున్న అధికారులు

భాకరాపేట: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడంపై అవగాహన కల్పించేందుకే 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చిన్నగొట్టిగల్లు, ఎర్రవారిపాళెం వ్యవసాయ అధికారులు ధనలక్ష్మి, ఖాదర్ బాషా అన్నారు. కార్యక్రమంలో భాగంగా వేరుశనగ, వరి, మామిడి, పీఎండీఎస్ పంటలను పరిశీలించిన, పంట రక్షణలో పాటించాల్సిన మెళకువల గురించి వివరించారు. ఉద్యానశాఖ అధికారి శివకుమారి మాట్లాడుతూ హార్టికల్చర్‌కు సంబంధించిన స్కీములు, మామిడి, టమాట పంటలకు సోకే తెగుళ్ల మెలకువలపై అవగాహన కల్పించారు. పశువైద్యాధికారి డాక్టర్ కృష్ణకాంత్ మాట్లాడుతూ రైతుసేవా కేంద్రం ద్వారా సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు, సంపూర్ణ మిశ్రమ దాణా, గడ్డి కత్తిరించే యంత్రాలను త్వరలో సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో రైతుసేవా కేంద్రం సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పాకాలలో..

పాకాల: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి జిల్లా మైక్రో ఇరిగేషన్ ఆఫీసర్ సతీష్ తెలిపారు. మంగళవారం పంటపల్లి రైతుసేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా 5 ఎకరాల లోపు ఉన్న రైతులకు 90 శాతం, 5 నుంచి 10 ఎకరాలలోపు భూమి ఉన్న రైతులకు 70 శాతం, 10 ఎకరాల కన్నా ఎక్కువ ఉన్న రైతులకు 50 శాతం రాయితీతో డ్రిప్ అందిస్తున్నట్లు తెలిపారు. పాకాల, కావలివారిపల్లి, ఉప్పరపల్లిలో పంట నమోదు చేసుకున్న పొలాలను క్షేత్రస్థాయిలో తమ సిబ్బందితో కలసి పరిశీలించారు. చంద్రగిరి ఉద్యాన అధికారి శైలజ, ఏఓ పుష్పావతి, వ్యవసాయ విస్తరణ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి

రామచంద్రాపురం: రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల వైపు మొగ్గు చూపాలని జిల్లా ప్రకృతి వనరుల కేంద్రం శిక్షణ సమన్వయకర్త భాస్కరయ్య అన్నారు. మంగళవారం మండలంలోని కుప్పంబాదూరు రైతు సేవాకేంద్రంలో రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు విపరీతంగా వాడడం వల్ల భూమి నిస్సారమవుతుందన్నారు. ఘన, ద్రవ జీవామృతాలతో సాగు చేపట్టడం వల్ల భూమికి జీవం పోయవచ్చని తెలిపారు. ఈ క్రమంలో నెత్తకుప్పం గ్రామంలో పండ్ల తోటలో సాగులో మేలైన యాజమాన్య పద్ధతులను గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి వేణుగోపాలరావు, తిరుపతి ప్రాంతీయ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త రజిత, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వయోవృద్ధుల దినోత్సవం



వృద్ధులకు ట్రై సైకిళ్లు, చేతికర్రలు వితరణ చేస్తున్న ఎమ్మెల్యే, అతిథులు, రాస్ ప్రతినిధులు



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ శ్రీహరి

తిరుపతి కల్చరల్: రాస్ కార్యాలయంలో వయోవృద్ధుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం జి.రాంప్రసాద్, రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెంకటరత్నం హాజరయ్యారు. ఎమ్మెల్యే ఆరణి మాట్లాడుతూ వయోవృద్ధులకు రాస్ చేస్తున్న సేవలు ఆదర్శనీయమని కొనియాడారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం రాంప్రసాద్ మాట్లాడుతూ వృద్ధులకు రాస్ సంఘాలు చక్కటి ఆర్థిక క్రమశిక్షణను కలిగి ఉన్నాయని ప్రశంసించారు. రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెంకటరత్నం మాట్లాడుతూ ప్రభుత్వాల సహకారంతో 40 ఏళ్లకు పైగా వృద్ధులకు సేవలందిస్తున్నామని తెలిపారు. వృద్ధులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం వృద్ధులకు చేతికర్రలు, దుప్పట్లు ట్రైసైకిళ్లు, వీల్‌చైర్స్, వినికిడి పరికరాలు, బియ్యం అందించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తరఫున 300 మంది వృద్ధులకు రూ.50 వేలు విలువ చేసే స్టీల్‌ప్లేట్లను వితరణ చేశారు. రాస్ సంయుక్త కార్యదర్శి మమత, బ్యాంక్ మేనేజర్ మొగిలేశ్వర్ పాల్గొన్నారు.

రుయాలో..

తిరుపతి తుడా: తిరుపతి జిల్లా డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి ఆధ్వర్యంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం రుయా ఆస్పత్రిలోని వృద్ధాప్య విభాగంలో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2024లో ఈ దినోత్సవం 'వృద్ధులకు అర్హత కల్పించడం' అనే విషయాన్ని థీమ్‌గా జరుపుకోవడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు, జనరల్ మెడిసిన్ డాక్టర్ సురేష్, న్యూరాలజీ హెచ్‌ఓడీ వెంకటరమణ, డీపీఎంఓ శ్రీనివాస్ రావు, ప్రోగ్రాం ఆఫీసర్ పద్మావతి, డిస్ట్రిక్ ఎపిడెమియాలజీ లావణ్య పాల్గొన్నారు.

ప్రకృతిని సద్వినియోగం చేసుకోవాలి



స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

పాకాల : ప్రకృతిలో ఉపయోగం లేనిది అంటూ ఏదీ లేదని, ప్రతీ పదార్థాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా ప్రయత్నించాలని ప్రిన్సిపల్ డాక్టర్ మొహిద్దీన్ బాషా తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో జీ వేస్ట్ మేనేజ్‌మెంట్ అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి అన్ని తనే ఆహారాన్ని, రోజువారీ వినియోగించే పదార్థాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు, వృథా అయిన వస్తువులను వేరొక పనికి వినియోగించాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మహాత్మాగాంధీ ఆశయాలను సాధించాలని, సేవాభావాలను అలవర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మాసిలామణి, అధ్యాపకులు, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ(జిల్లా నిఘా మరియు పర్యవేక్షణ కమిటీ)ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాత కమిటీకి గడువు పూర్తికావడంతో కొత్త వారిని ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. ఆ మేరకు దరఖాస్తులను కలెక్టరేట్ కార్యాలయంలోని సంక్షేమ, సాధికారత అధికారి, సాంఘిక సంక్షేమ శాఖ వారి కార్యాలయం, రూమ్ నెం.309, బి-బ్లాక్‌లో ఇవ్వాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ నాన్ అఫీషియల్ సభ్యులు ఇద్దరు, ఎస్టీ కాని, ఇతర కులాలకు చెందిన ముగ్గురిని ఎంపిక చేస్తారని వెల్లడించారు. అయితే వారు సేవాభావంతో కూడిన వారై, సామాజిక సేవా దృక్పథం, పౌరహక్కుల చట్టం, అత్యాచార నిరోధక చట్టాలపై అవగాహన ఉండి, ఆసక్తి కలిగిన వారై ఉండాలని స్పష్టం చేశారు.